గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# జనవరి 2017
# కథలు




అది బాల నేరస్థుల న్యాయస్థానం.

పోలీసులు ఎనిమిదేళ్ళున్న ఒక కుర్రాడిని జడ్జి ముందు నిలబెట్టారు.

గుమాస్తా అందించిన కేసు ఫైలును తీసుకున్న జడ్జి, కేసు ఫైలును చదివి ఆశ్చర్య పోయాడు. దెబ్బలను చూసుకుంటూ, ఏడుస్తూ బోనులో నిలబడున్న కుర్రాడిని చూశాడు. న్యాయ మూర్తికి ఆగ్రహం వచ్చింది. వాడిని న్యాయ స్థానం లోకి తీసుకు వచ్చిన పోలీసులను చూసి "మీ స్టేషన్ ఇన్స్పెక్టర్ వచ్చారా?" అని అడిగాడు.

"లేదు యువరానర్...స్టేషన్ లోనే ఉన్నారు" చెప్పాడు ఒక కానిస్టేబుల్.

"ఈ న్యాయ స్థానానికి వెంటనే రమ్మని కబురు పెట్టండి..మీ ఇన్స్పెక్టర్ వచ్చిన తరువాత ఈ కేసు విచారణ మొదలు పెడతాను"

అని కానిస్టేబుల్ తో చెప్పి కేసు ఫైలును పక్కన పెట్టారు జడ్జి.

అర గంట తరువాత వచ్చిన ఇన్స్ పెక్టర్ను చూసి "ఈ కుర్రాడి మీద కేసు ఫైలు ప్రిపేర్ చేసింది మీరేనా?" అడిగాడు జడ్జి.

"ఎస్. సర్" అన్నాడు ఇన్స్ పెక్టర్.

"ఏం మనుషులయ్యా మీరు. చిన్న పిల్ల వాడిని పట్టుకుని గొడ్డును బాదినట్టు బాదారు. వాడేం తప్పు చేశాడని అలా కొట్టారు. దొంగ తనం చేశాడా? దోపిడీ చేశాడా?మాన భంగం చేశాడా? లేక జేబులు కొట్టాడా? లేదే... మహిళ బొమ్మను కౌగలించుకున్నాడు. అంత మాత్రానా వాడు పాడు బుద్ది గలవాడని మీరంతా ఎలా ఒక నిర్ణయానికి వచ్చారు?"... ఇన్స్ పెక్టర్ను చూసి గట్టిగా అరిచాడు.

"ఈ వయసులో వాడికి పాడు బుద్ది ఆలొచన వస్తుందా?...వీడికే కాదు...వీడి వయసులో ఉన్న ఏ పిల్లలకైనా అలాంటి ఆలొచన వస్తుందా? మీ ఇళ్ళల్లో వీడి వయసు పిల్లలు లేరా?...వాళ్ళకి కూడా ఇలాంటి బుద్దులే ఉన్నాయా...ఏం పోలీసులయ్యా మీరు?"

"పోలీసులంటే నేరారోపణలో ఎంత నిజముందో అక్కడికక్కడే కనుక్కునే మొదటి వ్యక్తులయ్యా. నేరస్తుల తల రాతలను రాసే వారిలో మీరే మొదటి వారు. అలాంటి బాధ్యత గల పదవులు నిర్వర్తిస్తూ నేరారోపణలో నిజముందో లేదో తెలుసుకోకుండా కళ్ళు మూసుకుని నేరం మోపబడిన వ్యక్తిని ఖైదు చేస్తూ ఎందుకయ్యా ఈ న్యాయస్థానాన్ని అవమానిస్తారు?"

"మొదటి సారి కాబట్టి మీమీద చర్య తీసుకోవటం లేదు...ఇక మీదటైనా కేసులలో నిజమెంతుందో తెలుసుకుని మీ విధులను నిర్వహించండి...దిస్ కేస్ ఈజ్ డిస్ మిస్సెడ్. కుర్రాడిని విడిచి పెట్టండి" ఆర్డర్ వేశారు జడ్జి.

కోర్టులో హాలులో నిలబడి అప్పటి వరకు ఇదంతా గమనిస్తున్న కొబ్బరి కాయల కొట్టు యజమాని రాజయ్య సంతోషం పట్టలేక పరిగెత్తుకుంటూ వెళ్ళి కుర్రాడిని కౌగలించుకుని "నీకేమీ కాదని నాకు తెలుసు పిచ్చాయ్...ఎందుకంటే ఎప్పుడూ న్యాయంగా బ్రతకాలనే మనసున్న బొమ్మల బామ్మ చని పోయినా నీకు ఎప్పుడూ తోడుగా ఉంటుందని నాకు తెలుసు" అని చెప్పి వాడ్ని తనతో తీసుకు వెళ్ళాడు.

కొట్లో ఉన్న స్టూలు మీద పిచ్చాయిని కూర్చోబెట్టి, మంచి నీళ్ళు ఇచ్చి "ఉండు...నొప్పులకు మాత్ర ఇస్తాను" అని చెప్పి మాత్ర తీసుకు రావాడానికి లోపలకు వెళ్ళాడు కొబ్బరి కాయల కొట్టు యజమాని రాజయ్య.

మాత్ర తీసుకుని తిరిగి వచ్చి చూస్తే పిచ్చాయ్ అక్కడ లేడు. "అమ్మోరి గుడి దగ్గరున్న వేప చెట్టు దగ్గరకు వెళ్ళుంటాడు" అనుకుంటూ ముఖానికి పట్టిన చెమటను తుడుచుకుంటూ తన కుర్చీలో కూర్చున్నాడు రాజయ్య.

అతని మనసు పిచ్చాయ్ జీవిత చరిత్రను గుర్తు చేసుకుంది.

*******

ఆ స్కూల్ గేటు బయట చొక్కా లేకుండా నిలబడున్నాడు ఎనిమిదేళ్ళున్న పిచ్చాయి.

ప్రతి రోజూ ఆ స్కూల్లో లంచ్ బెల్ కొట్టక ముందు నుండే అక్కడకు వచ్చి నిలబడటం పిచ్చాయికి అలవాటు. లంచ్ బెల్ కొట్టిన వెంటనే పిల్లలందరూ పరిగెత్తుకుంటూ స్కూల్ కాంపౌండ్ లోని చెట్ల కింద లంచ్ బాక్సులతో నిలబడున్న వారి తల్లి తండ్రుల దగ్గరకు వస్తారు. నవ్వుతూ, ఏవో కబుర్లు చెబుతూ, తల్లులు ప్రేమతో పెడుతున్న లంచ్ బాక్స్ లోని ఆహారాన్ని ఆనందంతో తింటారు. గేటు బయట నిలబడున్న పిచ్చాయికి ఆ దృశ్యం ఎంతో ఆనందానిస్తుంది. ఆ ఆనందం కోసమే రోజూ వాడు లంచ్ టైముకు ఆ స్కూల్ గేటు దగ్గరకు వచ్చి నిలబడతాడు.

లంచ్ అయిన తరువాత పిల్లలు మిగిల్చిన ఆహారాన్ని కొంతమంది తల్లులు పిచ్చాయికి ఇస్తారు. వాడు ఎంతో ఆనందంతో ఆ ఆహారాన్ని తింటాడు.

పిచ్చాయి ఆ స్కూల్ గేటు దగ్గరకు లంచ్ టైమ్ కి వచ్చేది తిండి కోసం కాదు. అడుక్కోవడం వాడికి నచ్చదు. అడుక్కోవడం తప్పు, కష్ట పడి, ఏదైనా పని చేసి సంపాదించి తినాలని వాడికి, వాడిని పెంచిన బొమ్మల బామ్మ చెప్పింది. బొమ్మల బామ్మ ఏది చెబితే అది వేద వాక్కుగా తీసుకుంటాడు పిచ్చాయి.

లంచ్ టైమ్ ముగిసిన తరువాత స్కూల్ దగ్గర నుండి బయలు దేరి తిన్నగా మార్కెట్ వీధి లోకి వస్తాడు పిచ్చాయి. ఆ వీధిలో

ఉన్న బట్టల కొట్టు దగ్గర నిలబడతాడు. బట్టల కొట్టు బయట నిలబెట్టిన మహిళ అలంకార బొమ్మను కళ్ళార్పకుండా తదేకంగా చూస్తాడు. అది చూసి బట్టల కొట్లోని ఉద్యోగస్తులు పిచ్చాయిని కసురుకుంటారు.

పిచ్చాయి రోజూ లంచ్ టైముకు ఆ స్కూల్ గేటు దగ్గరకు ఎందుకు వస్తున్నాడు? అడుక్కోవడం నచ్చని పిచ్చాయి పిల్లలు మిగిల్చిన ఆహారాన్ని వారి తల్లులు ఇస్తుంటే ఎందుకు తింటున్నాడు? బట్టల కొట్టు దగ్గర నిలబడి అలంకార బొమ్మను ఎందుకు తదేకంగా చూస్తాడు?... వీటన్నిటికీ సమాధానం ఆశ!...ఎనిమిదేళ్ళ పిచ్చాయికి ఉన్న ఆ ఆశ ఏమిటో?

*************

ఎవరో పిచ్చాయిని కనేసి ఒక చెత్త కుండిలో పారేసి వెళ్ళి పోయారు. వాడిని ఆ చెత్త కుండీ నుండి తీసుకుని పెంచి పోషించేది బొమ్మల బామ్మ.

బొమ్మల బామ్మకు వయసు సుమారు డెబ్బై ఏళ్లుంటాయి. వయసులో ఉన్నప్పుడు ఇళ్ళల్లో పనులు చేసుకుని బ్రతికేది. వయసు మళ్లిన తరువాత శరీరం సహరించక పోవటంతో బొమ్మలు అమ్ముకుని కాలం వెళ్ళబుచ్చుతోంది. అందుకని ఆమెను అందరూ బొమ్మల బామ్మ అని పిలిచేవారు.

బొమ్మలు అమ్మిన డబ్బుతోనే తాను తింటూ, పిచ్చాయిని కూడా పోషించేది బొమ్మల బామ్మ.

బొమ్మల బామ్మకు ఇల్లు లేదు. అమ్మోరి గుడి బయట ఉన్న వేప చెట్టు నీడే ఆమెకు ఇల్లు. అక్కడే పిచ్చాయిని పెట్టుకుని నిద్ర పోయేది. వర్షం వచ్చినప్పుడు మాత్రం గుడి బయట ఉన్న వరాండాలో తల దాచుకునేది.

బొమ్మల బామ్మే వాడికి పిచ్చాయి అని పేరు పెట్టింది. ఆ పేరు ఎందుకు పెట్టిందో బొమ్మల బామ్మకు మాత్రమే తెలుసు. వాడు పసి గుడ్డుగా ఉన్నప్పటి నుండి వాడిని తనతో పాటూ, తాను ఎక్కడికి వెడితే వాడ్ని అక్కడకు తీసుకు వెళ్లేది.

వాడు పెరిగి పెద్దవాడవుతున్నాడు. బొమ్మల బామ్మకు అవి, ఇవీ అందివ్వటంలో సహాయ పడుతూ ఉండేవాడు. పాత గుడ్డలు అమ్మే రాజమ్మ దగ్గర అప్పుడప్పుడు పిచ్చాయికి గుడ్డలు కొనేది. అవే వాడికి కొత్త బట్టలు.

ఎందుకనో పిచ్చాయికి చొక్కా వేసుకోవటం ఇష్టం లేదు. బొమ్మల బామ్మ చొక్కా కొన్నా దాన్ని వేసుకునే వాడు కాదు. వేప చెట్టు క్రింద దాచేవాడు. బొమ్మల బామ్మ పిచ్చాయిని చొక్కా లేకుండానే ఎక్కువ రోజులు పెంచింది. బహుశ అలా పెరిగినందు వలనో ఏమో వాడికి చొక్కా వేసుకునే అలవాటు రాలేదు.

పిచ్చాయికి ఐదేళ్ల వయసు వచ్చేటప్పటికి వాడికి మాటలు బాగా వచ్చాయి. కాని ఎందుకనో ఎక్కువగా మాట్లాడే వాడు కాదు.

ఒక రోజు ఎండ ఎక్కువగా ఉన్నందు వలన బొమ్మల బామ్మ పిచ్చాయిని తనతో తీసుకు వెళ్ల లేదు. గుడి పక్కనున్న కొబ్బరి కాయల కొట్టు యజమాని రాజయ్యకు పిచ్చాయిని చూసుకోమని చెప్పి వెళ్లింది.

బొమ్మల బామ్మ తిరిగి వచ్చేటప్పుడు పిచ్చాయి గుడి ముందు నిలబడి అడుక్కుంటున్నాడు. గబగబా వాడి వైపుకు వెళ్ళి వాడ్ని లాక్కుని చెట్టు కిందకు వచ్చింది. "చూడయ్యా...అడుక్కుని డబ్బు సంపాదించుకో కూడదు...కష్ట పడి పని చేసి డబ్బు సంపాదించుకుని, ఆ డబ్బుతోనే తినాలి" అన్నది.

"అదెలా?" అని అమాయకంగా అడిగాడు పిచ్చాయి.

“ఎవరికైనా పని చేసి పెట్టి... వాళ్లిచ్చే డబ్బు తీసుకోవచ్చు"

"అదెలా?" అని మళ్ళీ అమాయకంగా అడిగాడు పిచ్చాయి.

"రేపు చూపిస్తా" అని బామ్మ చెప్పటంతో ఆ రేపు ఎప్పుడొస్తుందా అన్న ఎదురుచూపుతో నిద్రలోకి జారుకున్నాడు పిచ్చాయి.

*************

మరుసటి రోజు ఉదయం బొమ్మల బామ్మ తన పని మీద వెడుతూ, గుడి పక్కనున్న కొబ్బరి కాయల కొట్టు యజమాని రాజయ్యతో "వీడిని...పూరక కూర్చోపెట్టుకోకు. చిన్న, చిన్న పనులు చేయించు...నీకు తోచింది వాడి చేతిలో పెట్టు" అని చెప్పి వెళ్ళిపోయింది.

చాలా సేపు పని లేక కూర్చున్న పిచ్చాయికి పని చెప్పాడు కొట్టు యజమాని. నాలుగు కొబ్బరి కాయలను ఒక సంచీలో వేసి "ఇదిగో పిచ్చాయ్...ఈ సంచి తీసుకెళ్ళి పక్క వీధి మొదట్లో ఉన్న హోటల్లో ఇచ్చిరా" అన్నాడు.

"అలాగే" అంటూ యజమాని ఇచ్చిన సంచిని చేతిలోకి తీసుకున్నాడు. మోయ లేక క్రింద పెట్టాడు. అప్పుడు కొట్టు యజమాని, సంచిని పిచ్చాయి నెత్తి మీద పెట్టి "ఇప్పుడు వెళ్ళు" అన్నాడు.

పిచ్చాయి తిరిగి వచ్చిన తరువాత వాడి చేతిలో రూపాయి బిళ్ళ ఉంచాడు.

పిచ్చాయి ఆనందానికి అవదుల్లేవు. బొమ్మల బామ్మ ఎప్పుడు తిరిగి వస్తుందా అని ఎదురు చూశాడు. బొమ్మల బామ్మ రానే వచ్చింది. ఒక్క పరుగున బామ్మ ముందుకు వెళ్ళి "బామ్మా...ఇదిగో ఒక రూపాయి సంపాదించాను " అంటూ ఆనందంతో ఆ రూపాయి ఎలా వచ్చిందో చెబుతూ రూపాయను బామ్మ చేతిలో ఉంచాడు.

" చూశావా...కష్ట పడి పనిచేస్తే సంపాదించింది రూపాయైనా సంతోషం ఎలా పొంగుకు వస్తోందో...ఇక మీదట డబ్బును అలానే సంపాదించాలి" అంటూ “ఇదిగో ఈ రూపాయను నువ్వే దాచుకో. ఆకలేసినప్పుడు ఏదైన కొనుక్కు తిను...బిచ్చమెత్తుకోకూడదు...సరేనా" అన్నది.

"అలాగే బామ్మా" అంటూ తన రూపాయను తన మూటలో దాచుకుని బామ్మ దగ్గరకు వచ్చి కూర్చున్నాడు.

బామ్మ పేపర్లో చుట్టుకొచ్చిన రొట్టెను వాడి ముందు ఉంచి "తిను" అన్నది.

"తింటా గాని...మా అమ్మ ఎక్కడుందో చెప్పు బామ్మా" అని అడిగాడు.

"ముందు తిను" అన్నది బామ్మ.

"నేను తినను...మా అమ్మ ఎక్కడ అని ఎప్పుడు అడిగినా...తరువాత చెబుతానంటావు. నన్ను ఏమార్చి వెళ్లి పోతావు. ఈ రోజు చెబితే గాని తినను" మొండికేశాడు పిచ్చాయి.

చెప్పక తప్ప లేదు బామ్మకు... "నిన్ను కని, నా దగ్గర ఇచ్చేసి మీ అమ్మ శిలగా అయిపోయిందిరా" నోటికొచ్చింది చెప్పింది.

"అమ్మ శిల ఎక్కడుంది బామ్మా?" అమాయకంగా అడిగేడు పిచ్చాయి.

బొమ్మల బామ్మకు ఏం చెప్పాలో తొచక " మార్కెట్ వీధిలో బట్టల కొట్టు ఉందే...ఆ బట్టల కొట్టు ముందు నిలబడుంటుంది చూడు ఒక బొమ్మ...ఆమే నీ తల్లి" అని చెప్పి ఆ పూటకు హమ్మయ్య అనుకుంది.

వాడిని సమాధాన పరచాలని అప్పుడు బామ్మ చెప్పిన అబద్దాన్ని వాడు నిజమని నమ్మాడు.....వాస్తవం కంటే ఊహే గొప్పది...నిజ ప్రపంచం కంటే మనసు సృష్టించుకునే ప్రపంచమే గొప్పది.

అంతే...పిచ్చాయి గబ గబ పరిగెత్తు కుంటూ వెళ్లి ఆ బట్టల కొట్టు ముందున్న బొమ్మ దగ్గర నిలబడ్డాడు. తదేకంగా ఆ బొమ్మను చూశాడు. "అమ్మా...ఎందుకమ్మా నన్ను వదిలేసి వెళ్ళి పోయావు? నేను నల్లగా, అసహ్యంగా ఉన్నానని నీకు నచ్చలేదా?...అమ్మా నన్ను గట్టిగా ఒకసారి కౌగలించు కోవా?...నాకొక ముద్దు పెట్టవా?" అని బొమ్మ దగ్గర తన ఆశను వెలిబుచ్చాడు.

అది చూసిన బట్టల కొట్టు యజమాని "రాయ్...అక్కడ్నుంచి వెళ్లు...కష్టమర్లు వచ్చే వేల అయ్యింది" అని అరిచాడు.

పిచ్చాయి అక్కడ్నుంచి వెనక్కి తిరిగి నెమ్మదిగా నడుచుకుంటూ వేప చెట్టు క్రిందకు వచ్చాడు. నిద్ర పోతున్న బొమ్మల బామ్మ పక్కన కూర్చున్నాడు.

***************

బొమ్మల బొమ్మ చనిపోయింది.

కొబ్బరి కాయల కొట్టు యజమాని రాజయ్య పిచ్చాయిని తన దగ్గర ఉంచుకున్నాడు. మధ్యాహ్నం పూట, రాత్రి పూట వేప చెట్టు క్రిందకు వెడతాడు పిచ్చాయి. ఇప్పుడు బొమ్మ మూట కూడా వాడి ఆస్తి అయ్యింది.

ఒక రోజు పిచ్చాయి కొట్టు యజమానిని అడిగాడు "నిజమైన అమ్మలు ఎక్కడుంటారు" అని. దానికి యజమాని "మార్కెట్ పక్కనున్న స్కూలుకు పన్నెండింటికి వెళ్ళు...బోలేడు మంది అమ్మలు కనబడతారు" అన్నాడు.

ఆ రోజు నుండి రోజూ మధ్యాహ్నం పన్నెండు గంటల లోపే ఆ స్కూల్ దగ్గరకు వెళ్లటం, అక్కడ లంచ్ టైముకు పిల్లల తల్లులు, తమ పిల్లలకు లంచ్ పెడుతుంటే చూసి ఆనందపడటం, లంచ్ బాక్సులలో మిగిలి పోయిన లంచ్ ను తల్లులు పిచ్చాయికి ఇస్తే, అది తన తల్లే ఇచ్చిందని సంతోష పడటం పిచ్చాయికి రొటీన్ అయి పోయింది.

అదే లాగా రోజుకు ఒక సారైనా బట్టల కొట్టు ముందున్న బొమ్మ దగ్గరకు వెళ్ళటం, బొమ్మ దగ్గర తన ఆశను మొర పెట్టుకోవటం వాడికి ఒక లక్ష్యంగా మారింది.

***************

ఆ రోజు కూడా రోజూ లాగానే స్కూలు గేటు బయట నిలబడి స్కూలు పిల్లల తల్లులను చూసి ఆనంద పడ్డాడు పిచ్చాయి. కానీ ఎందుకనో ఆ రోజు లంచ్ అవర్ పూర్తి కాకుండానే తిరిగి వచ్చేశాడు.

కోరుకున్నది మనసులో ఎంత స్పష్టంగా ముద్ర వేసుకుంటుందో...అంతే త్వరగా అది వాస్తవానికి దారి తీస్తుందంటారు. అదే జరిగింది.

స్కూలు నుండి బయలు దేరిన పిచ్చాయి నేరుగా బట్టల కొట్టుకు వచ్చాడు. బట్టల కొట్టు గుమ్మంలో పెట్టిన బొమ్మను పైకి కిందకూ ఒకసారి చూశాడు. బొమ్మను చూసి "ఎన్నిసార్లు అడిగినా నువ్వు నన్ను ఎందుకు కౌగిలించుకోవటం లేదమ్మా? ఎందుకు ముద్దు పెట్టుకోవటం లేదమ్మా?...ఆ స్కూల్లో పిల్లలను చూడు, వాళ్ళ అమ్మలు వాళ్ళకి ముద్దులూ పెడుతున్నారు...ముద్దులూ పెడుతున్నారు.....నువ్వు కౌగలించుకోక పోతే...నేనే నిన్ను కౌగలించుకుంటా" అంటూ ఆ బొమ్మను గట్టిగా కౌగలించుకున్నాడు.

బట్టల కొట్టు యజమాని, ఉద్యోగస్తులూ అది చూశారు."ఈ వయసులో వాడికి ఎలాంటి బుద్ది పుట్టిందో చూడండి...బొమ్మను కౌగలించుకున్నాడు" అని అరుచుకుంటూ బయటకు వచ్చిన బట్టల కొట్టు యజమాని ఫటేల్ మని చొక్కా లేని పిచ్చాయి వీపు మీద ఒకటిచ్చాడు. ఉద్యోగస్తులూ తలో దెబ్బ వేసి వాడిని లోపలకు లాక్కు వెళ్ళారు.

“ఈ వయసులో వీడికి ఇదేం బుద్ది...ఇలాంటి వారే పెరిగి పెద్దయ్యాక అఘాయిత్యాలు చేస్తారు" అన్నాడు ఒక ఉద్యోగి.

"రోజూ వాడు ఆ బొమ్మ వైపు చూస్తూ నిలబడుతున్నప్పుడే అనుకున్నా...వీడు వక్ర బుద్ది గల వాడని" అన్నాడు మరో ఉద్యోగి.

బట్టలు కొలిచే స్కేలుతో వాడ్ని కొట్టేడు యజమాని.

బట్టల కొట్టు ముందు చిన్న గుంపు చేరింది. "వీడిని పోలీసులకు అప్పచెప్పండి... వాళ్ళు వీడిని పిల్ల నేరస్తుల జైల్లో పడేస్తారు" గుంపులో ఎవరో అన్నారు.

బట్టల కొట్టు యజమాని పోలీసులకు ఫోన్ చేసాడు.

ఏం జరుగుతోందో, ఎందుకు కొడుతున్నారో తెలియని అయోమయ స్థితిలో ఉన్న పిచ్చాయి వాళ్ళు కొట్టే దెబ్బలు భరించ లేక "కొట్టద్దు...కొట్టద్దు" అంటూ ఏడుస్తూ నిలబడ్డాడు. వాడి తరపు న్యాయం ఎత్తి చెప్పటానికి ఎవరూ లేరు...వాడికి చెప్పటం చేత కాదు...చెప్పినా ఎవరూ వినరు.

పోలీసులు వచ్చారు. విషయం తెలుసుకున్నారు. "ఈ వయసులో నీకు ఇదేం పాడు బుద్ధిరా" అంటూ వాళ్ళు కూడా నాలుగు తగిలించేరు."వీడొక అనాధ వెధవ సార్" అన్నాడు ఒక పోలీసు.

అందరూ కలిసి ఒక టెర్రరిస్టును బంధించి తీసుకు వెడుతున్నట్టు పిచ్చాయిని పోలీసు స్టేషనుకు తీసుకు వెళ్లారు.

**********

వాళ్ళూ, వీళ్ళూ కొట్టిన దెబ్బల వలన కలిగిన నొప్పిని భరించ లేని పిచ్చాయి రాజయ్య కొట్లో కూర్చోలేక అక్కడ్నుంచి బయలు దేరి మెల్లగా నడుచుకుంటూ వేప చెట్టు క్రిందకు వచ్చాడు. పాత గుడ్డల మూటను తీసుకుని తల కింద పెట్టుకుని ఒక పక్కకు తిరిగి పడుకున్నాడు.

వాడి కళ్ళల్లో నుండి కారిన కన్నీరు బుగ్గలపై నుండి క్రిందకు జారాయి. ఆ కన్నీరు...దెబ్బల నొప్పి వలన వచ్చినవా? ...లేక అమ్మ అనుకుని ఆ బొమ్మను కౌగలించుకున్నాడే...ఆ ఆనందంలో వచ్చిన ఆనందభాష్పాలా?...తెలియటం లేదు!!




ఆ మధ్య వార్తా పత్రికలన్నీ హోరెత్తి పోయాయి. కరీం అనే మాజీ నక్సలైట్ ని ఎన్ కౌం టర్ లో పోలీసులు హత మార్చినట్టు.

అప్పటి నుంచీ రోజూ వివిధ కధనాలు ఒక్కొక్కటే బయటికి వస్తున్నాయి. పోలీసుల, పొలిటీషియన్ల సహాయంతో ఎలా సెటిల్ మెంట్లు చేసి కోట్లకు కోట్లు ఎలా సంపాదించాడో.

కొంత మంది నిజాయతీ పరులయిన పోలీసులు అతన్ని పట్టుకోవడానికి ప్రయత్నించినప్పుడు, అదే డిపార్ట్ మెంట్ లోని వారి సహాయంతో ఆడవేషాలు కూడా వేసుకుని ఎలా తప్పించు కున్నాడో అన్నీ వివరంగా బయటికి వచ్చాయి.

చాలా మంది రాజకీయ వేత్తలకి, పోలీసు అధికారులకి అతనితో సంబంధాలు ఉన్నాయని బాహాటం గానే ప్రకటించారు.

అసలు ఎన్ కౌంటర్ ఎందుకు జరిగిందో కూడా బయటికి వచ్చింది. కరీంకి, అతని నేర సామ్రాజ్యం లో వస్తూన్న విజయ పరంపర,

వసూలవుతున్న వందల కోట్లు అన్నీ కలిపి తనకి తిరుగు లేదన్న ఒక భావన బాగా తల కెక్కి చేసే నేరాల వలని బాగా విస్తృత పరిచి ప్రభుత్వం లో ఉన్న ఉన్నతాధికారుల్నీ, అధికారంలో ఉన్న రాజకీయ వేత్తల దగ్గర బంధువులనీ కూడా వదలకుండా వేధించడం మొదలుపెట్టాడు. అందరికీ తెలిసిన, మన చిన్న ప్పుడు చెప్పుకునే, చీమ కథలో లా " నా పుట్టలో వేలు పెడితే నేను కుట్టనా ?" అన్నట్టు రాజకీయ వేత్తలు, అధికారులు కలిసి అతని కథ ముగిద్దామని నిర్ణయించుకున్నారు. అమలు చేయడానికి చాలా జాగ్ర త్తలు తీసుకోవాలిసి వచ్చింది. ఎందుకంటే రెండు మాట్లు ఉన్నతాధికారుల నుంచే మన వాడికి ఉప్పు అంది తప్పించుకు పోయి, తన చుట్టూ సెక్యూ రిటీ ని బాగా పటిష్టం చేసుకున్నాడు. చివరికి బాగా ఉన్నత స్థాయి లో ముగ్గురు నలుగురు మధ్యనే ఉంచుకుని, ప్లాన్ ని అమలు పరిచారు.

అయితే మొత్తం కథనాలన్నీ చదివితే సామాన్య ప్రజలకి ఎదురయ్యే ముఖ్యమయిన ప్రశ్న ఏమిటంటే. చాలా మంది రాజకీయ వేత్తలకీ, పోలీసు అధికారులకీ అతనితో సంబంధాలు ఉన్నాయని చెప్పిన పత్రికలు మాత్రం, ఏ పేర్లూ బయట పెట్ట లేదు. వాళ్లకి అవి తెలుసునని అందరికీ తెలుస్తూనే ఉంది. దీనిని బట్టి అందరూ గొంతెత్తి అరిచే పత్రికా స్వాతంత్ర్యం భారత దేశంలో మాత్రం నేతి బీర కాయ లో నెయ్యి వంటిదేనేమో.

కరీమ్ తో సంబంధాలు ఉన్న రాజకీయ వేత్తల, పోలీసు ఆఫసర్ల పేర్లు బయటికి రాక పోవడం ఒక పెద్ద మిస్టరీ గా మారింది. దానిని బట్టి మొత్తం ఆపరేషన్ ఉద్దేశం వేరే ఎదో ఉందేమో నని చాలా మంది ఊహా గానాలు చేస్తున్నారు.

పైకి వచ్చిన కథనాలతో ప్రజలు ఆశ్చర్యంలోంచి తేరుకోవడానికి ప్రయత్నిస్తుంటే, కరీం సహాయంతో అడ్డంగా సంపాదించిన అధికారులూ, రాజకీయ వేత్తలూ, ఇంకా హవాలా ద్వారా కానీ, ఇతర మార్గాల ద్వారా కానీ భద్ర పరుచు కొని కోట్ల రూపాయల్ని జాగ్రత్త పరుచు కోవడం లో మల్ల గుల్లాలు పడుతూ, అటు వంటి వాటి మీద సలహాలు చెప్పే కన్సల్టెంట్ల చుట్టూ తిరుగుతున్నారు.

రంగనాథ రావు, ప్రభుత్వం లో ఓక కీలక మయిన డిపార్టుమెంట్లో ముఖ్య అధికారి. అతనికి రాత్రి పొద్దు పోయిన తరువాత అందిన ఓ ఫోన్ కాల్ తో చాలా ఆందోళన పడుతున్నాడు.

రంగనాథ రావు ఉద్యోగం , విత్తనం కూడా చల్లకుండా నిత్యం పంట కోసుకోవడానికి వీలుండే పొలం లాంటిది. ఆ ఉద్యోగంలో ఎవరు చేరాలన్నా, సర్వీస్ కమిషన్ పరీక్షలో మొదటి పది ర్యాంకుల వాళ్ళు తప్ప మిగతా వాళ్ళు ఎవరయినా లక్షలు ఇచ్చి చేర వలసిందే. ఆయన మామ గారు కట్నం లో భాగంగా అటు వంటి ఉద్యోగం ఆయనకి సంపాదించి పెట్టారు. మొట్ట మొదటి అపాయింట్ మెంట్ ఒక్కటే కాదు, ఆ తరువాత మామ గారి(ధన)పలుకు బడితో ఏ ఊర్లో వేయించుకుంటే ఎక్కువ రాబడి ఉంటుందో అక్కడికి బదిలీలు మానేజ్ చేసి చాలా బాగా సంపాదించాడు. ఆయన సంపాదించినది చాలా ఎక్కువ అయినా,

తెలివి తేటలుగా సంపాదించిన దానిని బయటకి ఎక్కువ ప్రదర్శించ కుండా జాగ్రత్త పడుతూ వచ్చాడు. ఆయన మీద పిటిషన్లూ అవీ వెళ్ళక పోవడానికి ఆయన తీసుకున్న ఇంకో జాగర్త సహాయ పడింది. బాగా ఉన్న వాళ్ళ దగ్గర గుంజినా, చిన్నా చితక వాళ్ళకి చాలా మందికి ఏమీ తీసుకో కుండా సహాయ పడేవాడు. అంత దురాశ లేకుండా సంపాదించినా, ఆయన దగ్గర చాలా డబ్బు పోగయింది. ఆ మధ్యన ప్రభుత్వం ప్ర కటించిన "మన్నింపు" పథకం లో కొన్ని కోట్లు టాక్స్ కట్టేసి ఆ డబ్బుని చాలా స్థిరాస్తులలో పెట్టాడు. అవికూడా ఇప్పుడు బాగా ధర పలుకుతూండడంతో అమ్మేసి కాష్ చేసుకున్నాడు. ఇప్పుడు హవాలా ద్వారా కొడుక్కి సింగపూర్ పంపడానికి ప్లాన్ చేస్తున్నాడు. కొడుకు అమెరికా లో పెట్టే ఓ ఫ్యాక్టరీకి కావలసిన డబ్బును అక్కడ నుంచి మళ్లించుకోవ డానికి ప్లాన్. వందల కోట్ల లో ఉంది కాబట్టి, హవాలా కి అందివ్వడానికి కూడా ఒక అంబులెన్సును, మార్చురీ నుంచి ఒక శవాన్ని, దానికి సంబంధించిన డెత్ సర్టిఫికెట్ వగైరాలూ అన్నీ ఆరెంజ్ అయి పోయాయి.

కానీ అతనికి వచ్చిన ఫోన్ కాల్ లో వివరాలు ఆందోళన కలిగించేలా ఉన్నాయి. అతను, కావలసినప్పుడల్లా డబ్బు సర్దు బాటు చేసి, మందు పార్టీలు అవీ బగ్గా ఇచ్చి నరహరి అనే రిపోర్టర్ ని కాన్ఫిడెన్స్ లో ఉంచుకున్నాడు. అతనే ఫోన్ చేశాడు క్రితం రాత్రి. చేర వేసిన వార్త ఏమిటంటే కరీం ఎన్ కౌంటర్ తరువాత వేసిన ప్రత్యేక బృందం అతని ఇళ్ల నుంచి చాలా పుస్తకాలూ డైరీలు స్వాధీన పరుచుకున్నారని, వాటిలో అతనికి సహాయ పడిన కొందరు అధికారుల పేర్లు ఉన్నాయని. అందులో రంగ నాధ రావు పేరు కూడా ఉందని సమాచారం. ఆ బృందం ఆ పేర్లు వెంటనే బయట పెట్టక పోయినా ఆయా వ్యక్తుల మీద విచారణ జరిగే అవకాశం ఉందని భోగట్టా.

ప్రస్తుతం రంగనాధరావు ఆందోళన ఏమిటంటే, కరీం కి సహాయం చేయడం వలన వచ్చిన మొత్తం తక్కువ కాక పోయినా, తాను ఇంత కాలం కష్ట పడి(?) సంపాదించిన చాలా డబ్బు, కరీంతో వ్యవహారాలకు సంబంధం లేనిది, అంతా ఒక చోట చేర్చడమయ్యింది. అదీ కాకుండా కరీం కూడా కొంత డబ్బు పెద్ద మొత్తం లో తన దానితో హవాలా చేయ డానికి అతని దగ్గర దాచాడు. డబ్బు బయటికి పంపే దాకా ఏదయినా అయితే కొంప మునిగి నట్టే. అటు వంటి పరిస్థితి ఊహించ డానికే అతనికి భయం గా ఉంది.

ఎంత తొందరగా చేయాలనుకున్నా, అంత మొత్తాన్ని వేన్లో సర్దాలంటే అర్ధ రాత్రే జరగాలి కాబట్టి కనీసం రెండు రోజులు పట్ట వచ్చు. ఈ మధ్యలో ఏమీ జరగ కూడదని ఏడుకొండలవాడిని ప్రార్ధించాడు. అతను ప్రతి సంవత్సరం ఒక మాటు తిరుపతి వెళ్లి తన మొత్తం ఆదాయం లో పది శాతం హుండీ లో వేయడం మాత్రం మానడు, సంవత్సర ప్రీమియం లాగ

******

అప్పుడెప్పుడో జరిగిన కారు ప్రమాదాన్ని తన విక్టిమ్ ని బెదిరించడానికి కరీం ఎలా వాడుకున్నాడోనన్న కథనాన్ని

పేపర్లో చదివి అప్పుడే పేపర్ టేబిల్ మీద పెట్టాడు రంగ నాథ రావు

ఆయన ఏమి బిజీ గా ఉన్నాడో కానీ వెంకటేశ్వర స్వామి కి రంగ నాథ రావు ప్రార్థన విన పడినట్టు లేదు. అప్పుడే మఫ్టీ లో ఉన్న ముగ్గురు ఆఫీసర్లు వచ్చారు రంగ నాథ రావు ఇంట్లోకి. వాళ్ళ బాడీ లాంగ్వేజి బట్టి వాళ్లెవరో గ్రహించడానికి అట్టే సేపు పట్ట లేదు. "కంగారు పడకు మామూలు గానే ఉండు" అని తనకి థానే ధైర్యం చెప్పుకుని

"ఎవరు సార్ ? ఎక్కడి నుంచి? "అని అడిగాడు అమాయకంగా ముఖం పెట్టి

వాళ్ళల్లో ఒకతను 'ఐడి' చూపించి " కొంచెం మాట్లాడుకుందాము" అన్నాడు. రంగ నాథ రావు చూపించిన కుర్చీల్లో కూర్చున్నారు ముగ్గురూ

" అలాగేనండి" అన్నాడు రంగ నాథ రావు సాధ్యమయినంత మటుకు మామూలు గా ఉండడానికి ప్రయత్నిస్తూ. ఆ ప్రయత్నంలోనే తాను కూడా ఓ కుర్చీలో కూర్చున్నాడు

ముగ్గురిని ఓ మాటు చూసి నవ్వి " కాఫీనా? టీ నా? అన్నాడు లేచి ఇంట్లోకి వెళ్ళబోయి.

" అటువంటి ఫార్మాలిటీస్ ఏమీ వద్దు లెండి కూర్చోండి " అన్నాడు 'ఐడి' చూపించిన వ్యక్తి. ఆయనే లీడర్ కాబోలు టీమ్ కి అనుకున్నాడు రంగ నాథ రావు మళ్ళీ కూర్చుంటూ

"కరీం మీకు ఎప్పటి నుంచి తెలుసు?" అడిగాడు ఒక ఆఫీసర్ "వ్యక్తిగతంగా పరిచయం లేదు. ఉద్యోగ పరంగా ఎప్పుడయినా కలిశాడేమో గుర్తు లేదు"

" కరీంకు మీరు ఎందుకు సెటిల్ మెంట్లు వ్యవహారాలలో సహాయం చేశారు ? ఎంత తీసుకున్నారు ?

ఎదురుగా టేబుల్ మీద ఉన్న పేపర్లో హెడ్ లైన్ కంట పడి రంగ నాథ రావుకి ఐడియా ఫ్లాష్ అయింది

" అతను నన్ను బెదిరించాడండి. ఫామిలీ మెంబెర్స్ ని చంపుతానన్నాడు" అన్నాడు దీనంగా మొహం పెట్టి

"ఇప్పుడే మీకు అతనితో పరిచయం లేదు అన్నారు? " క్రాస్ చేశాడు ఆఫీసర్

"అతని అనుచరుల ద్వారా బెదిరించాడు"

"అంటే మీరు అతని దగ్గర నుంచి ధన సహాయం పొంద లేదా ?"

"ఎం చెప్పాలో తెలియక తలా అడ్డంగా ఊపాడు"

వచ్చిన ముగ్గురిలో ఒకతను, ఎదో పుస్తకం తెరిచి, అందులో వేలు పెట్టి ప్రశ్నలు వేస్తున్న అధికారికి చూపించాడు

"మీకు చాలా డబ్బు చెల్లించినట్టు ఎంట్రీలు ఉన్నాయి" అన్నాడు నిలదీసి. మళ్లీ ఆయనే " అతని ద్వారా మొత్తం ఏ మాత్రం గడించారు?

రంగ నాధ రావు మాట్లాడలేదు ఆ ఆఫీసర్ లేచి గుమ్మం దాకా వెళ్లి ఎవరితోటో ఫోన్లో మాట్లాడి వచ్చాడు

ఆ ఆఫీసర్ ఈ మాటు "మీ ఇంటి ప్లాన్ తీసుకు రండి" అన్నాడు మళ్ళీ ఇంకొకళ్ళకి ఫోన్ చేస్తూ

రంగ నాధ రావు లోపలికి వెళ్ళగానే ఫోన్లో "టీం ని కౌంటింగ్ మెషీన్స్ తో పంపు" అన్నాడు మెల్లి గా.

రంగ నాధ రావు ఇంటి ప్లాన్ తెచ్చిన తరువాత, అతన్ని దూరంగా కూర్చోమని, మిగతా టీం మెంబర్స్ తో కలిసి ఆ ప్లాన్ ని

స్టడీ చేశారు

ఈ లోపులో ఒక పది మంది టీం దిగడం మొత్తం ఇల్లంతా ప్లాన్ సహాయంతో శోధించడం మొదలెట్టారు.

రంగ నాధ రావు భార్య కంగారు పడుతోంటే ఆమెతో మాట్లాడ డానికి లోపలికి వెళ్ళాడు రంగ నాధ రావు. పని పూర్తయే దాకా బయటికి వెళ్ళ వద్దని చెప్పారు ఆఫసర్లు రంగ నాధ రావుకి.

సాయంత్రానికి ఇంట్లో దొరికిన కాష్ అంతా మొదటి ఫ్లోర్ లో హాలు, బెడ్ రూముల నిండా నిండి పోయింది. అంతా మూడు రూముల్లో సద్దారు. వచ్చిన అధికారుల్లో ముఖ్య అధికారి, కాష్ లెక్క పెట్టడానికి వచ్చిన పది మందినీ మూడు రూముల్లో సద్ది ఏ గదిలో లెక్కించిన మొత్తం ఆ గది నుంచి తనకి డైరెక్ట్ గా తెప్పించుకుని నోట్ చేసుకున్నాడు. కౌంటింగ్ అవగానే ఆ పది మందిని పంపేశారు.

రహస్య చాంబర్లన్నీ వెదికి పట్టుకున్నారు. గోల్డ్, డైమన్డ్స్ యొక్క విలువే చాలా ఉండేలా ఉంది

మర్నాడు తెల్లవారు ఝాము దాకా, కౌంటింగ్ జరిగింది. కాష్ మూడు వందల కోట్లు అని తేల్చి, మిగతా వాటితో పాటు అది కూడా ఒక రిజిస్టర్ లో రాసి రంగ నాధ రావు ని సంతకం పెట్టమన్నారు.

సంతకం పెట్టమన్నప్పుడు రంగ నాధ రావు కొంత ఆశ్చర్య పోయాడు. కేష్ మూడు వందల కోట్లు అని రాశారు. తన లెక్క ప్రకారం నాలుగు వందలు. అందులో మూడు వందలు కోట్లు కరీం తన దగ్గర దాచినది. కరీం చనిపోగానే అంతా ఇక తనదే అనే భావనలో ఉన్నాడు అంటే వీళ్ళకి అంతా దొరకలేదన్న మాట. వీళ్లు వెళ్లిన తరువాత చూసుకోవాలి అనుకున్నాడు లోలోపల కాస్త తేరుకుంటూ. బహుశా మాస్టర్ బెడ్రూమ్ బాత్రూం సీలింగ్ లో ఉన్న రహస్య చాంబర్ దొరికి ఉండదు అనుకున్నాడు.

అన్నీ అయిన తరువాత, మొత్తం వివరాలు ఆ ఆఫీసర్ ఎవరికో ఫోన్ లో వివరాలన్నీ చెప్పాడు.

కావలసిన సంతకాలు అన్నీ తీసుకుని వాళ్ళు వెళ్లి పోయారు..

వాళ్ళు వెళ్లి పోయిన వెంటనే, వీధి తలుపులు వేసి మాస్టర్ బెడ్రూమ్ కి పరుగెత్తాడు. అతని ఆశలు అడియాసలె అయ్యాయి. అక్కడ రహస్య ఛాంబర్ కూడా చిన్నాభిన్నమయి ఉంది.

వెంఠనే ఇల్లంతా మళ్ళీ పరుగు పరుగున కలియ తిరిగి అన్ని రహస్య ప్ర దేశాలూ వెదికి డ్రాయింగ్ రూములో కూలబడ్డాడు.

అప్పుడు అర్ధం అయ్యింది అతనికి. మొత్తం నాలుగు వందలూ గోవిందా అని. అప్పుడు ఫ్లాష్ అయ్యింది అంటే మూడు వందలకే సంతకం ఏమిటి? మరి మిగతా వంద కోట్లు?

మొత్తం ఆపరేషన్ మీద అతను విన్న ఊహా గానాలు అతని మెదడులో మెరిశాయి..

అతని భార్య లబో దిబో మంటూ హాల్లోకి వచ్చింది. మొత్తం అంతా పోయినట్టేనా? అంది ఏడుస్తూ.

అంత అధైర్య పడకు. ఇంకా రాజకీయం చేతుల్లోనే ఉంది అనుకుంటున్నా. కొంచెం ఖర్చు అయినా బయట పడవచ్చునేమో అన్నాడు తనకు తానె ధైర్యం చెప్పుకుంటూ.

వెంఠనే అతను అధికార పార్టీలో ఉన్న ఒక దూరపు బంధువుకు ఫోన్ చేశాడు. సలహా అడుగుదామని. అన్నీ చెప్పకుండా కొంత విషయం చెప్పి సలహా అడిగాడు. ఆయన తనకి హోమ్ డిపార్ట్ మెంట్ లో ఒకతను బాగా తెలుసునని. కనుక్కొని చెబుతానని ఫోన్ పెట్టేశాడు

మరునాడు అతను ఫోన్ చేసి చెప్పింది ఏమిటంటే, అసలు ఇంకా కరీం కేసులో ఇన్వెస్టిగేషన్ పూర్తి అవ లేదనీ, అది పూర్తి అయితే గాని ఏ యాక్షనూ, ఎవరి మీదా ప్రారంభించరని.

రంగ నాధ రావుకి కాళ్ళూ చేతులూ ఆడలేదు. వెంఠనే ఏ సి బి ఆఫీసుకి ఫోన్ చేసి అంత క్రితం రోజు ఐడి చూపించిన ఆఫీసర్ పేరు చెప్పి ఆయన కోసం అడిగాడు.

అటువంటి వారు ఎవరూ అక్కడ పని చేయడం లేదని చెప్పారు.      ఒక్క మాటుగా కుదేలు అయి పోయాడు రంగ నాధ రావు. హార్ట్ అటాక్ వస్తుందేమో నని భయం కూడా వేసింది. ఆ రోజంతా నరకం లో ఉన్నట్టు గడిచింది

******

రంగ నాధ రావు కి మనసు పరి పరి విధాల పోయింది. ఎలా జరిగింది? ఎవరు చేశారు లేదా, చేయించారు?

అతను విశ్లేషించుకుంటే ఏసీబీ కాక పోతే రెండే రెండు వర్గాల ద్వారా జరిగి ఉండాలి అనిపించింది. మొదట అతని ఆలోచనలు జనతా బిల్డర్స్ మీదకి పోయింది. తన బిల్డింగ్ వాళ్ళే కట్టారు. దాని ఓనర్ తన భార్య వైపు దగ్గర బంధువు. నమ్మకస్తుడు. అతని సలహా పైనే రహస్య మాళిగలు కట్టే      కంపెనీ బొంబాయ్ లో ఉందంటే, అతని ద్వారానే సంప్రదించడం జరిగింది. బొంబాయి కంపెనీ కూడా ప్రత్యేకం గా ఉత్తరాదిలోని వివిధ పట్టణాల నుంచి ఒక్కొక్కడినే రప్పించి వాళ్ల చేత రహస్య చాంబర్స్ కట్టించడం జరిగింది. తన లాగే చాలా మంది ఆ కంపెనీ ద్వారానే కట్టించుకున్నారు. కట్టించి పదేళ్లవుతున్నా, రహస్యాలు బయటికి వెళ్లి దోపిడీలు జరిగిన సందర్భాలు ఏమీ లేవు. కాని వచ్చిన వాళ్లు ప్లాన్ తెప్పించుకుని పరిశీలించడం అనుమానానికి తావిచ్చినా రహస్య చాంబర్స్ ప్లాన్ లో చూపించ లేదు కాబట్టి ఆ అవకాశం      లేదు. ప్లాన్ బట్టి ఊహించి చేసిన పనే కానీ వేరే కాదు.

అయితే మిగిలినది, తన దగ్గర డబ్బు దాచిన సంగతి తెలిసి, ఇంకా పట్టుబడకుండా తప్పించుకు పోయిన కరీం అనుచరులు ఎవరయినా చేసి ఉండవచ్చు. అదే కనక జరిగితే మొత్తం రాబట్టు కోవడం కష్టమేమో కానీ, ఒక వేళ వాళ్లని పోలీసులు పట్టుకుంటే మార్గాలు వెతకవచ్చేమో అనుకున్నాడు. అది దృష్టిలో ఉంచుకుని ప్రణాళిక వేయాలి అని నిర్ణయించుకున్నాడు. వివిధ పట్టణాలలో ఉంచిన బ్యాంకు లాకర్ల దాకా వాళ్ళు వెళ్లని విషయం భార్యకి చెప్పి, ఆమెకి కొంచం ఊరట కలిగించాడు. అంత అధైర్య పడకు అని అంటూ ఆమె దృష్టి కాస్త మళ్లిద్దామని టీవీ ఆన్ చేశాడు.

నరేంద్ర మోడీ గారు దేశ ప్రజలని ఉద్దేశించి మాట్లాడుతూ " ఈ అర్ధ రాత్రి నుంచి 500, 1000 రూపాయల నోట్లు      ఫలానా తేదీ లోగా బ్యాంకులలో జమ చేసి వివరణ ఇవ్వక పోతే చిత్తు కాగితాలే " అని ప్రకటిస్తున్నారు.

ఆత్రుతగా మొత్తం అంతా విన్నారు

అంత ఏడుపు లోనూ వాళ్ళిద్దరికీ నవ్వు వచ్చింది. కాగితాలు ఎవరి దగ్గర ఉంటె ఏమిటి!

*****

ఇంచు మించు అదే సమయానికి చిలుకూరుకు కొంచెం దూరం లో ఉన్న ఓ ఫామ్ హౌస్ లో హర్ష వర్ధన్ తన ముగ్గురు మిత్రులతో మందు పార్టీ లో ఉన్నాడు. అతను కరీం ముఖ్య అనుచరులలో ఒకడు.

అతను రంగ నాధ రావు ఇంట్లో టీం లీడర్ గా వ్యవహరించిన కరుప్పన్ ని ఉద్దేశించి అన్నాడు. "మీరు సరిగ్గా కౌంట్ చేశారా ? నా అంచనా ప్రకారం నాలుగు వందలు కంటే ఎక్కువ ఉండాలే. కరీం దాచినదే మూడు వందలు కదా?" అన్నాడు వాళ్ళ కేసి మత్తుగా చూస్తూ.

"లేదు చాలా జాగ్రతగా కౌంట్ చేశాము. మొత్తం అంతే ఉంది. ఇంకా ఎక్కడైనా పెట్టాడేమో తెలియదు. అతను కూడా మాట్లాడకుండా సంతకం పెట్టాడు " అన్నాడు కరుప్పన్ మిగతా ఇద్దరికేసీ ఏమీ తడబడ కుండా చూస్తూ. తాను తొక్కి పట్టిన వంద కోట్లు గురించి ఆనందంగా మనసులో మెదలుతోంటే యధాలాపంగా టీవీ ఆన్ చేశాడు. రంగ నాధ రావు, భార్య విన్న ప్రధాన మంత్రి ప్రకటనని అప్పుడే మళ్ళీ రిపీట్ చేస్తున్నారు.

హర్ష వర్ధన్, అతని అనుచరులు అదనంగా మందు ఏమీ తీసుకోకుండానే వాలి పోయారు.




"హర్షా... కాఫీ ఇచ్చింది తాగడానికే కానీ అలా చేతిలో కప్పు పట్టుకుని ఆలోచిస్తూ కూర్చోవడానికి కాదు!" సోఫాలో కూర్చున్న భర్తతో చెప్పింది హరిణి.

"ఓ అయాం సారీ హరీ... తాగేస్తాను." అని నిశబ్దంగా కాఫీ సిప్ చేస్తూ ఉండిపోయాడు హర్ష.

"ఏమయింది హర్షా... రోజూలా హుషారుగా లేవు ఇవాళ. ఏం జరిగింది? ఆఫీసులో ఏదైనా ప్రోబ్లెమా?"

"అబ్బే అదేమీ లేదు హరీ... అంతా బాగానే ఉంది." మామూలుగా ఉండటానికి విఫల యత్నం చేసాడు హర్ష.

"నీకు నా దగ్గర నటించడం రాదులే హర్షా! అసలు విషయం ఏమిటో చెప్పు." భర్త కనుల్లోకి సూటిగా చూస్తూ అడిగింది హరిణి. ఒక్క సారిగా హర్ష ముఖమంతా దిగాలుగా మారిపోయింది. "మనం ఊళ్ళోనే ఉండి ఉంటే బావుండేది కదా!" ఉద్వేగంగా చెప్పాడు హర్ష.

"వచ్చి అప్పుడే మూడేళ్ళు దాటిపోయింది. సడన్ గా ఏమయింది హర్షా?!" భర్త బాధపడుతూ చెప్పే సరికి కంగారుగా అడిగింది హరిణి.

"కంగారు పడాల్సిన విషయం ఏమీ లేదు హరీ... ఇది చదువు." అంటూ జేబులోంచి కవర్ తీసిచ్చాడు హర్ష. కవర్ తెరిచి అందులోని కాగితం మడతలు విప్పి చూసింది హరిణి.

"హాయ్ చిన్నీ!

ఎలా ఉన్నావురా! నువ్వూ హరిణీ అక్కడ కులాసాగా ఉన్నారని తలుస్తాను. నేనూ వదినా పిల్లలూ బావున్నాము.

చిన్నీ! ఈమధ్య నువ్వు బాగా గుర్తుకొస్తున్నావురా! మీరెళ్ళిపోయి మూడు కాదురా ముప్పై ఏళ్ళు దాటిపోయినట్టుగా అనిపిస్తోంది నాకు. ప్రతిరోజూ ఏదో ఒక సందర్భంలో నువ్వు నాకు గుర్తుకొస్తూనే ఉంటావు. ఇంటి వెనుక పెరట్లో నేను ముఖం కడుక్కుంటున్నప్పుడు నువ్వు నా మీద నీళ్ళు చల్లి ఏడిపించడం గుర్తుకొస్తూ ఉంటుంది. మామిడిచెట్టును చూసినప్పుడల్లా నిన్ను నేను ఉయ్యాల ఎక్కించి దింపకుండా చాలాసేపు ఏడిపించడం కళ్ళలో మెదులుతుంది. మన బడి వైపు వెళ్ళినప్పుడల్లా మనిద్దరం జట్టు కట్టి కబడ్డీ ఆటలో శ్రీనుగాడి గ్యాంగును చిత్తుచిత్తుగా ఓడించడం గుర్తొచ్చినప్పుడల్లా గర్వంగా అనిపిస్తుంది.

ఇంట్లోని షోకేసులో మనిద్దరమూ ఆటల్లో గెలుచుకున్న కప్పుల్ని చూస్తుంటే మనం పోటీలు పడి ఆ కప్పులను గెలుచుకున్నామని సంబరంగా ఉంటుంది. నీకూ నాకూ అయిదేళ్ళ తేడా ఉన్నా ఒకే ఈడు పిల్లల్లా మనం ఆడిపాడిన రోజులన్నీ గుర్తుకొచ్చి మనసు ఆనందంతో గంతులేస్తూ ఉంటుంది. అంతలోనే నువ్వు లేవన్న వెలితి గుండెను దేవేస్తూ ఉంటుంది.

పెద్ద పండుగ దగ్గరికొచ్చేస్తుంది కదా! అమ్మకు అరిసెలు వండటానికి సాయం చేస్తుంటే నా చేతిలోని అపక జారి బాణలిలోని వేడి వేడి నూనె నా కాలి మీద పడి నేను ఏడుస్తుంటే "ఏ అరిసెలు చెయ్యకపోతేనే కానీ పండగ పూర్తవ్వదా?! అంటూ అమ్మను కోప్పడి, "ఏడవకన్నయ్యా!" అంటూ నువ్వు నా కాలికి నవనీతం రాసి, అటుపై అమ్మకు అరిసెలు వండటంలో సాయానికి వెళ్ళడం గుర్తుకొచ్చి కళ్ళల్లో నీళ్ళు తిరుగుతూ ఉంటాయిరా చిన్నీ!

భోగిమంటల్లో వెయ్యడం కోసం ఊరంతా మనం కట్టెల కోసం గాలించేటపుడు, సుబ్బయ్యగారి తోటలో త్రాచుపాము కనిపిస్తే కట్టెలన్నీ వదిలేసి మనం పరుగు పరుగున ఇంటికి చేరుకోవడం నీకు జ్ఞాపకం ఉందా? నాకైతే అది ఇంకా తాజాగా గుర్తుందిరా చిన్నీ!

ఈ సారి సంక్రాంతి పండుగ మనం కలిసి చేసుకోవాలని చాలా కోరికగా ఉందిరా చిన్నీ! హరిణిని తీసుకుని ఒక వారం రోజులు సెలవు పెట్టి రారా! మనమిద్దరం కలిసి ఊళ్ళో తిరుగుతూ "రామలక్ష్మణులు!" అని అందరిచేతా అనిపించుకుని ఎన్నాళ్ళో అయిపోయిందిరా!

వస్తావు కదూ?

హరిణికి నా ఆశీస్సులు. తనకు కూడా బావ తప్పకుండా రమ్మన్నాడని చెప్పు. ఎంతసేపూ ఫోన్లే కాని ఇలా ఆప్యాయంగా ఉత్తరాలు రాసుకుని చాన్నాళ్ళయింది కదూ?! అయినా నువ్వు ఈ అన్నయ్య పైన కోపంతో పూర్తిగా తెగతెంపులు చేసుకుని మాట్లాడటమే మానేసావుగా?! మన ఓఒళ్ళోఁని నీ ప్రాణమిత్రుడి ద్వారా నీ అడ్రస్ తెలుసుకోగలిగానురా!

నీకు ఈ ఉత్తరం రాస్తోంటే ఎందుకో చేతులు వణుకుతున్నాయిరా చిన్నీ! తప్పకుండా వస్తావు కదూ?!

ప్రేమతో...

నీ అన్నయ్య రవీంద్ర."

ఉత్తరం చదవడం పూర్తి చేసిన హరిణి కనులు కూడా సజలమయ్యాయి. తనతో పాటు ఉత్తరం మళ్ళీ చదివిన హర్ష కన్నుల్లో కూడా నీళ్ళూరడం గమనించి, "బాధపడకు హర్షా!" అంది.

"ఆ రోజు నేనే ఆవేశపడ్డాను." హర్ష గొంతు బాధగా ధ్వనించింది. వాళ్ళిద్దరి ఆలోచనలూ మూడేళ్ళ వెనక్కు వెళ్ళాయి.

***

"వీల్లేదన్నయ్యా! నాన్నగారు చెమటోడ్చి సంపాదించిన పొలం. దాన్ని నువ్వు అమ్మడానికి నేనొప్పుకోను." ఖరాఖండిగా చెప్పాడు హర్ష.

"చిన్నీ మొత్తం పొలం అమ్మెయ్యడంలేదురా! ఉన్న ఇరవై రెండెకరాల్లోనూ ఆరు సెంట్లు మాత్రమే అమ్ముతున్నా!" శాంతంగా చెప్పాడు రవీంద్ర.

"ఆరు సెంట్లు కాదు కదా అంగుళమంత భూమిని అమ్మినా నేనొప్పుకోను." కోపంగా అన్నాడు హర్ష.

"కొంచెం నా పెద్దరికానికి కూడా విలువ ఇవ్వాలి నువ్వు." రవ్వంత కోపం రవీంద్ర కంఠంలోనూ ధ్వనించింది.

"పెద్దవాడివని నీ ఇష్టమొచ్చిన నిర్ణయాలు నువ్వు తీసేసుకుంటే నేను ఊరుకోవాలా?" హర్ష అరిచాడు.

"చిన్నీ... అన్నయ్య ఏది చేసినా ఆలోచించే చేస్తాడు. నాన్నగారు చనిపోయి ఇప్పటికి పదేళ్ళయింది. అప్పటినుండీ కుటుంబ బాధ్యత తీసుకున్న అన్నయ్య తీసుకున్న నిర్ణయమేదీ తప్పవలేదు." హర్షకు సర్దిచెప్పే ప్రయత్నం చేసింది తల్లి కామేశ్వరి.

"ఆహా! అయితే అంతా కలిసే ఇదంతా చేస్తున్నారన్నమాట! మీ ఇష్టం వచ్చినట్టు చేసుకొంటూ మీరే ఈ ఇంట్లో ఉండండి. ఒక్క క్షణమైనా ఈ ఇంట్లో ఉండేది లేదు."

ఎవరెంత చెప్పినా వినిపించుకోకుండా భార్యను తీసుకుని సుదూరప్రాంతమైన ఈ పట్టణంలోకి వచ్చేసాడు హర్ష. రాగానే మంచి ఉద్యోగం కూడా దొరకడంతో అక్కడే ఉండిపోయారు హర్ష, హరిణి దంపతులు.

***

"అమ్మా! ప్రభా... త్వరగా రండి!" ఇంట్లోకి అరుస్తూ వచ్చాడు రవీంద్ర.

"ఏంట్రా హడావిడి? ఏం జరిగింది?" అంటూ కొడుకుకు ఎదురొచ్చింది కామేశ్వరి. మరో వైపునుంచి వచ్చిన ప్రభ కూడా భర్త వైపు చూస్తూ అదే భావాన్ని వ్యక్తం చేసింది.

"చాలా పెద్ద విశేషమే అమ్మా! ఇవాళ నాకెంత సంతోషంగా ఉందో తెలుసా మీకు? ఇదిగో ఇది పైకి చదివి వినిపించు ప్రభా!" అంటూ నవ్వాడు రవీంద్ర.

భర్త అందించిన ఉత్తరాన్ని పైకి చదవడం ప్రారంభించింది ప్రభ.

"ప్రియమైన అన్నయ్యకు,

నీ ఉత్తరం చదవగానే నా కన్నుల్లో నీళ్ళు ఆగకుండా వస్తూనే ఉన్నాయి. ఈ ఉత్తరం రాస్తుంటే కూడా! చిన్నప్పటి నుండి మనం కలిసి మెలిసి గంతులు వేస్తూ పెరిగిన రోజులు, ఊరంతా సందడి చేస్తూ ఆడిపాడిన రోజులు గుర్తుకొచ్చాయి.

సంక్రాంతి రోజుల్లో మనం గాలిపటాలు చేసి అందరు పిల్లలతో పాటుగా ఎగరేసేవాళ్ళం.

నాకు గాలిపటం తయారుచెయ్యడం వచ్చేది కాని దాని సూత్రం ముడి వచ్చేది కాదు. నేనెప్పుడు గాలిపటం తయారుచేసి ఎగరేసినా అది పల్టీలు కొడుతూ కిందకు పడిపోయేది. ఎప్పుడూ అలాగే జరుగుతుందని నేనోసారి బాగా ఏడ్చాను. అప్పుడు నువ్వొచ్చి ముడి ఎలా వెయ్యాలో నేర్పావు. నీకది నాన్నగారు నేర్పారని కూడా చెప్పావు. ఇప్పుడూ అంతే కుటుంబానికి మనం ఎలా ముడిపడి ఉండాలో కూడా నువ్వే చెప్పావు. అందుకే అన్నయ్యా, హరిణీ నేనూ శాశ్వతంగా మన ఊరికొచ్చేస్తున్నాం. నువ్వు కాదనవనే ధైర్యంతో వచ్చేస్తున్నా. దయచేసి నన్ను వెళ్ళిపోమనకు అన్నయ్యా!

అమ్మను, వదినను, పిల్లలనూ కలుసుకోవాలని ఎంతో ఆత్రుతగా ఉంది.

ఇక ఉంటాను.

ప్రేమతో...

నీ తమ్ముడు హర్ష.

***

ఇల్లంతా సందడిగా ఉంది. పిల్లలిద్దరూ "బాబాయ్ బాబాయ్! మాకు గాలిపటం చెయ్యడం నేర్పవూ?!" అని హర్ష వెంటపడి తిరుగుతున్నారు.

"మీ నాన్న కొచ్చు కదరా? తననడగండి." అన్నాడు హర్ష.

"నీ గాలిపటమెలా ఉంటుందో కూడా మాకు తెలియాలి కదా బాబాయ్!" ముక్తకంఠంతో పలుకుతూ ముద్దులొలుకుతున్న పిల్లలను దగ్గరకు తీసుకుని, "అలాగే నేర్పిస్తానర్రా!" అని చెప్పాడు హర్ష.

వాళ్ళ వైపు నవ్వుతూ చూస్తున్నారు మిగతా కుటుంబ సభ్యులు.

"ఒరేయ్ రవీంద్రా, హర్షా మీ ఇద్దరిలో నాకు అరిసెలు వండటానికి ఎవరు సాయం చేస్తారు?" అడిగింది కామేశ్వరి.

"నేను..." అంటూ ఇద్దరూ ఒకేసారి పరుగు పెట్టారు రవీంద్ర, హర్ష!

"ఆగండాగండి. అన్నీ మీరే చేసేస్తే మేమున్నదెందుకు?" అంది ప్రభ. ఆ మాటలకు అంతా హాయిగా నవ్వుకున్నారు.

ఆ రాత్రి...

హర్ష, హరిణి పడుకుని మాట్లాడుకుంటున్నారు.

"చాలా సంతోషంగా ఉందిరా నాకు." చెప్పాడు హర్ష.

"నాకూ చాలా ఆనందంగా ఉంది. ఇంతకూ ఓ విషయం తెలుసా నీకు?!"

"ఏంటి"

"మీ అన్నయ్య అప్పట్లో అమ్మిన ఆ ఆరు సెంట్ల పొలమూ మనకెందుకూ పనికిరాని మెరకనేలట. అవతలి రైతు కూడా తనకు వాస్తు కోసమని కొనుక్కున్నాడట!" చెప్పింది హరిణి.

"అవునా? విషయం సరిగ్గా తెలుసుకోకుండా ఎంత ఆవేశపడ్డానో నేను." బాధగా చెప్పాడు హర్ష.

"తమ్ముడికి ఆవేశం ఎక్కువమ్మా! నేనూ కోపాన్ని తగ్గించుకోవాలనుకో... నువ్వు బెంగ పడకు వాడిని ఊరికి రప్పిస్తానుగా అంటూ తనే చాలా కష్టపడి మన అడ్రస్ సంపాదించి ఉత్తరం రాసారట!"

"నిజంగా అన్నయ్య మంచితనం ముందు నేనెందుకూ పనికిరాను హరీ!" హర్ష గొంతులో సన్నని జీర!

"నేను మీ ఇంట్లో అడుగు పెట్టిన తొలిరోజుల్లో ఒకసారి పొలానికి బావగారితో కలిసి వెళ్ళాను. ఆ పచ్చదనానికి నేను పొంగిపోయి ఇలా ఊరికి దూరంగా ఓ పచ్చని తోట కొనుక్కుని అందులోనే ఉండిపోతే చాలా బావుంటుంది కదా బావగారూ అన్నాను."

"ఓహో!"

"ఆ ఆరు సెంట్లు అమ్మగా వచ్చిన డబ్బులకు ఇంకొంచెం డబ్బులు వేసి, ఒక పెద్ద తోట కొన్నారట బావగారు. పైగా దాన్ని..." హరిణి స్వరం వణికింది.

"ఊ... దాన్ని?" అడిగాడు హర్ష.

"నా పేరుతో రిజిష్టర్ చేయించారట!" హరిణి కన్నుల్లో తడి గొంతులో తెలుస్తూనే ఉంది!

***




ధఢ్ . . . ధఢ్ . . . ధఢ్ . . . ధఢాల్ . . . . .

పెద్ద చప్పుడు తో తలుపు తెరుచుకోగానే ఆజ్ హవా బహుత్ హైనా అమ్మా , నిచే కాబీ కొండీ లగాలో తబ్ నై ఖులేగా అని చెప్పి జహీరా వెళ్ళి పోయింది. ఓరిని గాలికి తెరుచుకుందా ఈ తలుపు ! ఏ దొంగోడు వచ్చాడో, ఏ దయ్యమో వచ్చిందోనని ఎంత హడలి చచ్చాను. ఈ తలుపులు మరీ ఇంత వికేమిటి బాబూ... ఇంత దడిపిస్తున్నాయి !

మేము ఈ ఇంట్లోకి వచ్చిన నాలుగైదు రోజులకేననుకుంటా, నేను వంట ఇంట్లో పని చేసుకుంటూ వుండగా, మా ఏమండీ పిలుపులు వినిపించాయి. ఏముంది, ఇందాక పేపర్ చదువుతూ కనిపించారు , పేపర్ ఏమైనా కింద పడి వుంటుంది. తీసి ఈయమనో, లేదా సెల్ తెచ్చియయమనో పిలుస్తున్నారులే అనుకొని చిన్నగా చేతిలో పని పూర్తి చేసుకొని వెళ్ళాను. ఏరీ ? ఈ మనిషెక్కడా కనిపించటము లేదే అనుకుంటూ ఇల్లంతా కలియ జూస్తూ,,, ఎక్కడండీ అని అడిగానా, ఈ గదిలో, బయట నుండి తలుపు తీయి అని ఓ గది లోనుండి వినిపించింది. ఇదేమిటి, గది తలుపు వేసుకొని నన్ను తీయమంటున్నారూ... అని ధీర్ఘం తీస్తూ బయట నుండి హాండిల్ తిప్పాను. రెండు సారులు తిప్పితేనే కాని రాలేదు. చెమటలు కక్కుతూ బయటకొచ్చారు. ఇంత సేపు ఏం చేస్తున్నావు? ఈ డోర్ రాలేదు, పిలవగానే రావద్దూ అని కోపం చేసారు. డోర్ రాక పోవటమేమిటి???

లోపల హాండిల్ విరిగి పోయింది అందుకని డోర్ వేస్తే లోపల నుండి తీయటానికి రాదు. నేను ముందు చూడ లేదు. జాగ్రత్త నువ్వు లోపలి కెళ్ళి తలుపేసుకోకు అన్నారు .

ఒక్క క్షణం భయం వేసింది. ఆ( ఈ సంగతి తెలిసాక నేను లోపలి కెళ్ళి తలుపేసుకోవటమా..నెవర్. ఐనా ఏమండీ లోపల ఉండగానో, పొరపాటున నేను లోపలికి వెళ్ళినప్పుడో పడి పోతే ఎలా? అందుకని, ఎలాగూ మావారికి తలుపు చెక్క మీద టవల్ ఆరేయటము అలవాటు కాబట్టి, ఏదో ఒక తలుపు మీద ఎందుకు, ఈ తలుపు మీదే వేస్తే పోలే అనుకొని, ఏమండి టవల్ ఏ తలుపు మీద వేసినా తీసుకొచ్చి ఈ గది తలుపు మీద వేయ సాగాను. ఐతే ఈయన గారు ఎప్పుడు ఆ టవల్ గుంజేస్తారో తెలిదు. అందుకని, స్టాపర్ పెట్టి, తలుపుకడ్డం గా ఓ కుర్చీ కూడా పెట్టాను. ఒకటి కాక పోతే ఒకటైనా తలుపు పడకుండా కాపాడుతాయి కదా అని. హాండిల్ లాక్ దగ్గర హోల్ లో బాగా కాగితాలు కూడా గుచ్చి అలా ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని అమ్మయ్య అని ఊపిరి తీసుకున్నాను. అ గదికి స్కేరీ రూం అని ఓపేరు కూడా తగిలించాము.

హుం నన్ను అలా నిశ్చింత గా ఏమండి ఉండనిస్తే ఇహ లేనిదేముంది ? మొన్నటికి మొన్న ఏం జరిగిందో తెలుసా ? ఆ రోజు ఆదివారం అమ్మ లంచ్ కు రమ్మన్నది. తయారైనాము. ఇంతలో ధోబీ కిషోర్ వచ్చాడు. అతనికి బట్టలేసి, డబ్బులిచ్చి పంపేసరికి పేపర్ బాయ్ ధృవ కుమార్ వచ్చాడు . అతని కి డబ్బులిద్దామని లోపలికి వచ్చాను. బాత్ రూం తలుపు, స్కేరీ రూం తలుపు వేసి వున్నాయి. చిన్నగా బాత్రూం తలుపు తోసాను. తెరుచుకుంది. స్కేరీ రూం తలుపు...తో..సాను.తెరుచుకోలే. గుండె జల్లు మంది. అనుమానంగా చిన్నగా హేమండీ అని పిలిచాను. .."ఊ.." లోపలి నుండి సమాధానం వచ్చింది. ఐనా లోపల వున్నారా గుస గుస గా, భయం భయంగా అడిగాను. ఏమిటా పిచ్చి ప్రశ్న? తీయ్ హాండిల్ అని అరిచారు. హాండిల్ తిప్పాను. రాలేదు. గట్టిగా తిప్పు లోపలి నుండి హుకుం. అబ్బే రాలే. రాలేదండి, గొంతులో ఏడుపు, వణుకు!! యేహే గట్టిగా గుంజు లోపలి నుండి అరుపు. ఘట్టిగా గుంజాను. ఫుటుక్ హాండిల్ ఫుటుక్ అయ్యో హాండిల్ విరిగి పోయిందండి వా

బయట నుండి ధృవ కుమార్ అమ్మా నా పైసలిస్తే నే పోతా అని ఒకటే పిలుపు. లోపలి నుండి ఏమండి ముందు వాడిని పంపించిరా అన్నారు. మూడొందలే ఇచ్చానో, నాలుగొందలే ఇచ్చానో ఇచ్చి పంపి, స్కేరీ రూం ముందుకొచ్చాను. మళ్ళీ తలుపు ఎలా తీయను? లోపలి నుండి ఏమండి హాండిల్ గట్టిగా తిప్పు అన్నారు. ఎక్కడండి హాండిల్ పుటుక్ మందిగా. ఐతే కీస్ పెట్టి తీయి అదీ నేనే చెప్పాలా బుర్ర లేదు అని వెటకారాలు."

నా బుర్ర సరే, కొంపలో వుండి చచ్చింది ఇద్దరమే, నేను బయటెక్కడో వున్నాను, తమరు తలుపు ఎందుకు వేసున్నట్లు ?

"పిచ్చిగా అరవకు నేనెక్కడ వేసాను? అదే పడింది. హాండిల్ తిప్పు"

"హాండిల్ విరిగి చచ్చిందని చెప్పానా ? కీస్ తో రావటము లేదు. ఇప్పుడెలా? పక్కింటి వాళ్ళను పిలవనా"

"పక్కింటి వాళ్ళను పిలుస్తావా? ఏమక్కర లేదు. కీస్ తో తీయ్"

కీస్ ఎంత తిప్పినా రాదే! భగవంతుడా ఏం చేయను? ఏడుపు, కోపం, భయంతో కాసేపు అటూ ఇటూ చూసి ఎందుకో వంటింట్లోకి వెళ్ళాను. అక్కడ జహీరా తోమటానికి గిన్నెలు తీస్తోంది. జహీరా సాబ్ అందర్ బంద్ హోగయే థోడా తుం దర్వాజా కోల్ సక్తే క్యా ట్రై కరో. మేరేసే నైహోరా. మేరా హాత్ పావ్ కాంప్రై అని కీస్ జహీరా కిచ్చాను. తను కీస్ పెట్టి తిప్పుతూ సాబ్ అందర్...అమ్మా బహార్ బంద్ హోగయే అని పాట మొదలు పెట్టింది. క్యా జహీరా క్యా బోల్ రహేహో. కుచ్ నై అమ్మా మేరోకో బాబీ కా గానా యాద్ ఆయా అంది. అప్పటి దాకా వున్న టెన్షన్ ఏమైందో నేనూ నవ్వుతూ పాట ఎత్తుకున్నాను .

సాబ్ అందర్ . . . అమ్మా బాహర్

దర్వాజా బంద్ హోగయా . . .

కొండీ తూడ్ గయా . . .

అందర్సే కోయి బాహర్ ,

బాహర్ సే కొయి అందర్ నా జాసకే

సోచో అబ్ క్యా హోగా . . . . .

" ఏమొచ్చిందే పిచ్చి పోరగాళ్ళారా, తలుపు తీయకుండా పాటలు పాడుతున్నారు. జహీరా కొండీ జోర్సే ఖీంచో "

"సాబ్ కొండీ తూడ్ గయా "

"ఇప్పటికెన్నిసార్లు చెప్పాను, హాండిల్ విరిగిందని. తలుపేసుకున్నారు కదా కూర్చోండి ."

"పిచ్చి వాగుడు వాగకు. నేనెక్కడ వేసాను అదే పడిందని చెప్పానా ?"

"టవల్, స్టాపర్, కుర్చీ, ఇనింటిని నెట్టుకుంటూ తలుపదే పడి పోయిందా?"

"ఇపుడవన్ని అవసరమా తలుపు తీయ్ ముందు"

"ఎలా తీయను ? అలాగే వుండండి. నేను అమ్మ దగ్గరికెళ్ళి లంచ్ చేసి మీకు కారియర్ తెస్తాను, ఈ లోపల ఏదో ఉపాయం తోచక పోదు."

"సద్దు జోకులాపు ముందు"

ఇంతలో నాకో బ్రహ్మాండమైన ఐడియా వచ్చింది. జహీరా కు స్క్రూ డ్రైవర్ ఇచ్చి, హాండిల్ ప్లేట్ వూడదీయమన్నాను. కాస్త అటూ, ఇటూ తిప్పింది. లేచి వంట ఇంట్లో కెళ్ళి కత్తి పట్టుకొని వస్తోంది . . .

ఇదేమిటి? కత్తి తెస్తోంది. ఆయన లోపల బంధీగా వున్నారు. నన్ను పొడిచి, నా మెడలోని గాజులు... చేతి గొలుసు...కాదు కాదు చేతి గొలుసు, అబ్బ ఏదో వొకటి నా వంటి మీది బంగారం తీసుకొని పారి పోదు కదా!! శ్రీ రామచంద్రా నారాయణా ఎన్ని కష్టాలు....ఆ కత్తి తో, స్క్రూ డ్రైవర్ తో కొద్దిగా వచ్చిన ప్లేట్ కు సపోర్ట్ పెట్టి మొత్తం ప్లేట్ వూడ దీస్తోంది. పాపం ఎంత అపార్ధం చేసుకున్నాను.

మొత్తానికి కష్టపడి హాండిల్ ప్లేట్ వూడ దీసింది. అక్కడ ఏర్పడ్డ కంతలో నుండి లోపలికి చూసి, అమ్మా సాబ్ దెకో కైసే భైటే అంది. నేనూ చూసాను. మంచం మీద కూర్చొని పైకి చూస్తున్నారు. ఏమండీ పైకి ధీర్ఘంగా చూస్తున్నారేమిటి ? పై కప్పు వూడ దీస్తే పై ఇంటాయాన తోలు తీస్తాడు అన్నాను నవ్వుతూ. ఉరిమి చూస్తూ వెధవ జోకులాపు అని, జహీరా చాబీసె నికాలో అన్నారు. మద్య లో తలుపు లేక పోతే నేను భస్మం ఐపోయే దానినే!!

అబ్బే ఆ చాబీ వుండటము లేదే! ఇప్పుడు మరీ కష్టమైంది. ఇదేమిటి ఇలా అవుతోంది.

ఇప్పుడెలా? ఇప్పటికే బంధి అయ్యి అరగంట పైన అయ్యింది. ఎలారా దేవుడా!

ఓ పక్క స్క్రూ      డ్రైవర్ తో తిప్పుతూనే, అమ్మా అగర్ సాబ్ బాహర్, అమ్మా అందర్ బంద్ హో గయా తో క్యా హోగా? అని అడిగింది.

"క్యా హోగా కాలియా? అమ్మ ఝూటర్ ఢమాల్ "

"ఏమొచ్చిందే మీకు , మీ పాటలు తగలెయ్య. తలుపు తీసి ఏడవండి ముందు."

"అబ్బ వుండండి. మరీ అంత మమ్మలిని చూసి కుళ్ళు కోకండి సారూ."

అమ్మయ్య స్క్రూడ్రైవర్ తో అటు తిప్పి, ఇటు తిప్పి ఎలా ఐతేనేం ఏమండి బంధ విముక్తులైనారు.

అందర్ సాబ్ . . . బాహర్ అమ్మా బంద్ హోగయే.

కొండీ తూడ్గయా, సోచో కభీ ఐసా హోతో క్యా హోగా? జహీరా మహా ఉషారుగా పాడేస్తోంది.

అది కాదండి, పైన టవల్..పక్కన కుర్చీ...

దూరంగా పడి వున్న కుర్చీ . . . . మా వారి నడుముకు టవల్...




రుక్మిణీదేవి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా చేసి ఈ మధ్యనే పదవి విరమణ చేశారు. ఆవిడకు ఇద్దరు కుమార్తెలు .

వివాహానంతరం ఇద్దరు ఆడపిల్లలు భర్తలతో విదేశాలలో స్థిరపడ్డారు. తమవద్దకు వచ్చి ఉండమని కూతుర్లు ఎంత బ్రతిమిలాడినా 'ఒంట్లో శక్తి ఉన్నన్నాళ్ళు స్వతంత్రంగా ఉండటమే నాకు ఇష్టం' అని చెప్పి వాళ్ళ అభ్యర్థనను సున్నితంగా త్రోసిపుచ్చారు ఆవిడ.

"మీ అమ్మాయిలు ఎంత బుద్ధిమంతులండి రుక్మిణిగారూ, మీరెంతో అదృష్టవంతులు" అని అందరూ పొగుడుతుంటే ఆవిడకి తన పెంపకం పైన ఎంతో గర్వంగా అనిపిస్తుంటుంది.

కూతుర్లు కుటుంబాలతో సహా పుట్టింటికి వచ్చి నెలరోజులయింది. రుక్మిణిదేవికి ఇద్దరు మనుమరాళ్ళు. తన దగ్గర ఉన్నన్ని రోజులు వాళ్ళని ఎంతో గారం చేస్తారు రుక్మిణీదేవి. పిల్లలు అల్లరిచేస్తుంటే సముదాయించలేక కూతుర్లు అవస్థ పడుతుంటే 'నా పిల్లలు ఎప్పుడు ఇంత అల్లరి చేయలేదు . చెప్పిన మాట వినేవారు. ఇదేం చోద్యమో?ఈ కాలం వాళ్ళకి పిల్లల్ని పెంచడమే చేతకాదు' అని అభిప్రాయపడతారే తప్ప అది అతి గారం చేయడం వల్ల అని మాత్రం అనుకోరు . ఇదంతా చూసిన మీదట ఆవిడకు తన పెంపకం పైన నమ్మకం మరింత బలపడింది. మనుమరాళ్ళ ముద్దు ముద్దు కబుర్లు వింటూ నెలరోజుల సమయం తెలియకుండానే గడిచిపోయింది ఆవిడకు.

రుక్మిణీదేవిది అద్దెకివ్వడానికి అన్ని సౌకర్యాలు ఉండేలా కట్టించిన మూడువాటాలు ఉన్న పెద్ద ఇల్లు. అందులో ఒక వాటాలో ఆవిడ ఉంటున్నారు. మిగిలిన రెండు వాటాలలో ఒక దానిలో రాజేష్ భావన దంపతులు తమ పదమూడేళ్ళ కూతురు మల్లికతో , ఇంకో భాగంలో గౌరి మహేష్ దంపతులు తమ ఆరు సంవత్సరాల కొడుకు రోహిత్ తో అద్దెకు ఉంటున్నారు. రుక్మిణీదేవి ఇంటికి అద్దెకున్న వాళ్ళ ఇళ్ళకి మధ్యలో ఒక గోడ మాత్రమే అడ్డుగా ఉండటంతో ఆవిడ ఎంత వద్దనుకున్నా వాళ్ళ సంభాషణలు, వాదనలు, పిల్లల పేచీలు ఇత్యాదివన్నీ చెవిని పడుతూనే ఉంటాయి.......

సమయం కుదిరినప్పుడు రుక్మిణీదేవి వద్ద కూర్చుని కష్టసుఖాలు చెప్పుకుంటూ ఉంటుంది భావన. ఇద్దరు ఆడపిల్లలను బుద్ధిగా పెంచిన అనుభవం ఉండడంతో పిల్లల పెంపకం విషయంలో ఆవిడ ఇచ్చే సలహాలు భావనకి ఎంతో ఉపయోగిస్తుంటాయి.

ఒక రోజు అలాగే రుక్మిణీదేవి వద్దకువచ్చి కూర్చుని లోకాభిరామాయణం మాట్లాడటం అయిన తరువాత పదమూడేళ్ళ తన కూతురు మల్లిక ఈ మధ్యన ఎక్కువగా విసుక్కోవడం పెడసరంగా సమాధానం చెప్పడం గురించి ప్రస్తావిస్తూ "మల్లికతో ఎలా మసలుకోవాలో తెలియడంలేదు పిన్నిగారూ!" అంటూ వాపోయింది భావన.

భావన ప్రస్తావించిన సంభాషణ యాథాలాపంగా చెవినపడి ఉండటంతో ఆమె ఆందోళనను అర్థం చేసుకున్నారు ఆవిడ.

“ఊరుకో భావనా! యుక్త వయసులో ఆడపిల్లలలో అనేకమైన శారీరిక మానసిక పరిణామాలు సంభవిస్తుంటాయి. ఆ కారణాన వారికే తెలియని చికాకులకి లోనవుతూ అది ఎవరిపై చూపాలో తెలియక తల్లిపైన చూపడం జరుగుతుంది. నువ్వే కొంచం సహనం వహించాలి . అది కొంత కష్టమే అయినప్పటికి అసాధ్యం మాత్రం కాదు. ఈ విషయంలో నీకు నీ భర్త రాజేష్ సహకారం ఎంతో అవసరం” అన్నారు.

ఆవిడ మాటలకి ఆలోచనలో పడిన భావన ‘అవును నేను రాజేష్ కలిసి నొప్పింపక తానొవ్వక అనే పద్ధతిలో మెలగాలి మల్లికతో’ అనుకుని “థ్యాంక్స్ పిన్నిగారూ అలాగే చేస్తాను” అని వెళ్లిపోయింది......................

మహేష్ గౌరీలకు రోహిత్ ఒక్కడే సంతానం. భర్త వాడిని అతి గారం చేయడం గౌరికి అంతగా ఇష్టం ఉండదు. ఈ విషయమై వారిమధ్య అభిప్రాయ భేదాలు వస్తుంటాయికుడా. ఈ సంగతి గ్రహించిన రోహిత్ కూడా తెలివిగా ఏదైనా కావలిస్తే తండ్రిని అడిగి కొనిపించుకుంటాడు......

ఆ రోజు ఆదివారం. భర్త మహేష్ సెలవు రోజున కూడా అత్యవసరమైన పని ఉందంటూ ఆఫీసుకి వెళ్లిపోవడంతో ఇంట్లో పనులన్నీ నెమ్మదిగా సాగుతున్నాయి. ఉదయం ఫలహారాల కార్యక్రమం తరువాత నెమ్మదిగా వంట మొదలు పెట్టింది గౌరి.

పదకొండుగంటలయిందో లేదో “అమ్మా ఆకలేస్తోంది అన్నం పెట్టమ్మా!” అంటూ వచ్చాడు రోహిత్ వంటింట్లోకి.

“ఇప్పుడేగా ఆ చిప్స్ తిన్నావు? అయినా ఇంకా వంట కూడా అవలేదు. ఈ లోగా వెళ్ళి హోంవర్క్ చేసుకుని రా అప్పుడు పెడతాను” అని తల్లి అనడంతో ఆమె అంటే ఉన్న సహజమైన భయం కొద్దీ ఎదురాడకపోయినా కాళ్ళు నేలకేసి తాడించి తన అసహనం అంతా చూపిస్తూ వెళ్లిపోయాడు రోహిత్ అక్కడినించి .

విసురుగా వెళుతున్న కొడుకుని చూసి ‘‘దూర్వాస మహామునిలాగా వీడికి ముక్కుమీదే కోపం . అడిగింది వెంటనే అందక పోతే అంతే ఇంక! వీడు ఇలాగే ఉంటే మున్ముందు కష్టమే’ అనుకుంటూ వంట పూర్తి చేయడంలో మునిగిపోయింది గౌరి .

కంచాలలో భోజనం వడ్డించి “రోహిత్ అన్నం తిందువుగాని రా” అని పిలిచింది గౌరి .

“ఇవాళ బంగాళదుంప కూర చేయలేదా? ఈ కూర నాకొద్దు నేను తినను.” అంటూ కంచం ముందు కూర్చొంటూనే పేచి మొదలు పెట్టాడు రోహిత్ .

“అన్నీ నీకిష్టమైనవే చేసినా బంగాళదుంప చేయలేదా అంటే ఎలా? పేచి పెట్టాకుండా అన్నం తిను రోహిత్” అంది.

“ఊహూ! నాకు బంగాళాదుంప కూర కావాలి అంతే , ఇప్పుడే చేసిపెట్టు” పేచీతో పాటు కంఠం కూడా పెంచి అరవసాగాడు.

“ఎప్పుడూ ఒకటే కూర అంటే ఎలా? అన్ని కూరలు తినడం అలవాటు చేసుకోవాలి . ఆఖరు సారిగా చెప్తున్నాను . పిచ్చి పిచ్చి పేచీలు పెడితే దెబ్బలు తింటావు ఇంక” కోపంగా తల్లి గదిమేటప్పటికి రోహిత్ కంఠస్వరం స్థాయి ఠక్కున తగ్గిపోయింది . వాడికి తెలుసు అమ్మ ఎప్పుడు కోప్పడదు కాని కోప్పడిందంటే మాత్రం అన్నంత పని చేస్తుందని.

ఉదయం తల్లి మందలించిందనే ఉక్రోషంతో పేచి మొదలుపెట్టాడే కాని అమ్మ చేసిన గుత్తి వంకాయ కూర , మామిడికాయ పప్పు, టమాటా చారు అన్నీ వాడికిష్టమైనవే. కాని అన్నిటి కంటే బంగాళాదుంప వేపుడంటే ఎక్కువిష్టం . రోజు రెండుసార్లు అదొక్కటే పెట్టినా తింటాడు రోహిత్ . అందుకే పేచి ఆపేసినా నసుగుతూనే భోజనం కానించాడు....

ఈ సంభాషణ అంతా పక్కింట్లో రుక్మిణీదేవి చెవిన పడుతూనే ఉంది . గౌరి కొడుకుని అలా కోప్పడటం అసలు నచ్చలేదు ఆవిడకి. మగపిల్లలు లేకపోవటంతో రోహిత్ ని ఎంతో ముద్దు చేస్తారు ఆవిడకూడా. వాడు కూడా “అమ్మమ్మా!” అంటూ ఆవిడ దగ్గర గారాలు పోతుంటాడు.

ఆ సాయంత్రం గౌరితో కూర్చుని కబుర్లు చెపుతున్నప్పుడు యాథాలాపంగా “ఎందుకమ్మా ఉదయం రోహిత్ ని అంతగా కోప్పడ్డావు?” అన్నారు.

”ఓహో! అయితే అంతా ఈవిడ చెవినపడిందన్న మాట” అనుకుని “అవును పిన్నిగారూ లేకపోతే వాడు ఆ పేచి ఆపేలా అనిపించలేదు”

“అయినా కానీ పాపం వాడు మాత్రం ఏమడిగాడు? రెండు బంగాళాదుంపలు ఎంతలో వేగుతాయి, చేసిపెడితే పోయేదిగా?”

“అదికాదు పిన్నిగారూ అన్నీ వాడికిష్టమైనవే చేసినప్పుడు కూడా అది లేదు, ఇది కావాలి అని పేచిపెట్టడం తప్పుకదా? అయినా ఎందులోనైనా వాడికి ఎంచుకునే అవకాశం ఇవ్వగలను కానీ భోజనం దగ్గర మాత్రం ఇవ్వలేను. అన్ని కూరలు తినడం ఇప్పటినుండే అలవాటవ్వాలి, అలాగే ఏది చేసిపెట్టినా తినాలి. ప్రత్యేకంగా వాడికిష్టమని కారం తక్కువగా వేసి రుచికరంగా చేస్తాను అయినా కూడా పేచి పెడితే ఎలా? రేపు పై చదువుల కోసం ఎక్కడికైనా వెళ్ళి ఉండాల్సి వచ్చినప్పుడు అక్కడ వాడికి కావలసినది దొరకనప్పుడు కావలసినది దొరకక, ఉన్నది తినలేక చిరుతిళ్ళకి అలవాటుపడి ఆరోగ్యం పాడుచేసుకుంటాడు. అది ఇంకా ప్రమాదం కదా? అందుకే ఇప్పుడు నేను కొంచం కోప్పడినా మున్ముందు వాడి మంచికే చేశానని తప్పక గ్రహించుకుంటాడు. ఆ నమ్మకం నాకుంది” అని “ఇద్దరికీ టీ కలిపి తెస్తానుండండి” లేచి వెళ్ళింది గౌరి .

ఆమె వెళ్ళిన వైపే చూస్తూ “అవును గౌరి పలుకులలో ఎంతో నిజం ఉంది. కాలంమారుతున్నా కొన్ని విలువలు మారకూడదు. ఇన్నాళ్ళూ అందరికీ పెంపకం గురించి సలహాలిస్తూ వచ్చిన నేను ఇవాళ ఒక చక్కటి విషయం తెలుసుకున్నాను. పిల్లల పెంపకంలో కొన్ని కొత్త పద్ధతులు అనుసరించవలసి వస్తున్నా.... ఆహారపు అలవాట్లు, శుభ్రతకి , క్రమశిక్షణకి సంబంధించిన అలవాట్లు మాత్రం చిన్నతనం నుంచే వారికి అర్థమయ్యే రీతిలో చెప్పాలి. అలాంటప్పుడు ఒక్కొక్కసారి కఠినంగా వ్యవహరించడం తప్పనిసరి అవుతుంది మరి. అదే ఈనాడు కొడుకుపట్ల గౌరి అమలుపరిచింది. నిజంగా ఆమె ఆలోచన ఎంతో అనుసరణీయం. ఈ విషయం భావనకి, నా కూతుర్లకి కూడా చెప్పాలి” అనుకుని గౌరి టీ తెచ్చేలోగా ఉదయం తను చేసిన మినపసున్ని గౌరికి పెడదామని లేచి వంటింట్లోకి వెళ్లారు రుక్మిణీదేవి.